# సరిగమలు

## ఉషా లావణ్య



**పం**డు వెన్నెల. విరగబూసినట్టున్న వెన్నెల. అదీ కార్తీక పౌర్ణమినాటి వెండి వెన్నెల. శిశిరంలో వీచే గాలీ, ధనుర్మాసపు వేకువ వెలుగై ఏకమైతే ఎలా వుంటుందో అంతటి హాయిని రగిలించే వెన్నెల. ఎన్నెన్నో వసంతాల మృదు గంధ కేతనాలను కొంగున ముడేసుకుని అలవోకగా తేలియాడుతూ నేలకు దిగి వచ్చే తూలిన సుతిమెత్తని స్పర్శను అనుభవించిన మనసే కదా దాని అసలు ఆనవాలు చెప్పగలిగేది.

మాటలకేం తెలుసనీ?

ప్రత్యూషంలో కర్పూర దీప గంధాలు దిగంతాలకు పయనించటం అంటే కరుగుతున్న కాలం తాలూకు కలగలుపు రంగులన్నీ చిరుతుంపరలై గుండెపై కురిసి కురిసి మట్టి వాసన పట్టి ఇచ్చే తొలకరి జల్లులా కలల పందిరిలో హరివిల్లులా విచ్చుకోవడమేగా.

మనో వ్యథకు మందు లేదూ మరుపుకు హద్దూ లేదు.

అయినా మరుపుకు రాని కార్తీక పున్నమిని మరవటం! మల్లె పందిరి ఇంట దీప, ఎర్ర గులాబీల లోగిలి గీత, గడప గడపకు కళ్ళాపి ముగ్గులు దిద్దే కళ. అందరూ కార్తీక నోములు నోచుకుంటున్నారు.

(మిగతా 38వ పేజీలో చూడండి)

# గ్లామర్ రోల్స్‌లో భూమిక!

అద్నాన్‌సామి వీడియో ఆల్బమ్‌లో చిరునవ్వులు చిందిస్తూ దేవతాకన్యలని మరిపించేలా కనిపించిన భూమిక ఇప్పుడు సినిమాల్లో గ్లామర్ పాత్రలో చేయడానికి ఓకే చెప్పింది. ఇన్నాళ్ళు ఎక్స్‌పోజింగ్‌కి దూరంగా ఉంటూ వచ్చిన ఈ చిన్నది బాలీవుడ్‌లో నిలబడాలంటే వస్త్రాల్లో సాధ్యమైనంత పొదుపు పాటించాలన్న విషయం గ్రహించినట్లుంది. దాంతో గ్లామర్ పాత్రలు చేయడానికి ఓ.కె. అనేసింది. అనడమే తరువాయి మూడు చిత్రాల్లో బుక్కయింది. పోనీలెండి మన భూమిక ఇప్పటికైనా విజయ రహస్యం కనుక్కున్నందుకు సంతోషిద్దాం!



## సరిగమలు కథ

**(35వ పేజీ తరువాయి)**

తనలో తాను ఏకాంతంగా గడపాలని తను వెళ్ళలేదు హారితి..

కార్తీకంలో చీకట్లు కూడా అత్తర్లు గుమ్మరిస్తుంటాయి. అది ప్రకృతి వింతో, మనసు వెదజల్లే స్మృతుల తుంపరలు తట్టి లేపే తపనో మరి. ఇక నిలవరించుకోవటం సాధ్యం కాదనిపించాక చెప్పులు తొడుక్కుని బయల్దేరింది హారితీదేవి.

❋ ❋ ❋

ఆటో దిగి గడప ముందు నిలబడింది హారితి. క్షణంలో క్షణంపాటు తటపటాయించి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చినదాన్లా బెల్లు కొట్టింది.

తెరుచుకున్న తలుపులు.. కుంకుమ వర్ణపు వెంకటగిరి చీర, నుదుట సింధూరపు బొట్టు, తల నిండా పూలు, కళ్ళలో ఎవరూ అన్న ప్రశ్న. ఆ వెంటనే గుర్తుపట్టినట్టుగా పక్కకు జరిగి లోపలకు రమ్మన్నట్టుగా పీయూష్ వైపు విసిరిన చూపు. ఆ చూపులో శబ్దం లేకుండా నవ్విన నవ్వు. అందులో కోపం లేదు. విసుగు లేదు. ఏహ్యాభావం అంతకంటే లేదు. 'అనుభవించు మరిక' అన్న ఎత్తిపొడుపు. పెదవి విప్పి ఒకమాటైనా మాటాడకనే కొంగున ముడేసుకుని ఒక మూతి విరుపుతో కనుబొమ్మ వంపుతో భర్తల్ని ఒక ఆటాడించి ప్రేమతో సాధించటం అన్నది తెలుగింటి భామలకు వెన్నతో పెట్టిన విద్యే.

ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్న పీయూష్ సంభాషణ ముగించి, 'రండి' అంటూ ఆఫీస్ గదివైపు నడిచాడు. ఎప్పుడో ఫ్రెండ్సుందరితో కలిసి వాళ్ళ యింటికి వెళ్ళింది హారితి. ఆ తర్వాత ఇలా ఇప్పుడే రావటం.

మందపాటి లైట్ల వెలుతురులో మౌనంగా అతడి వెనకే నడుస్తున్న హారితికి నున్నటి పాలరాతి గచ్చుపైన కాలు జారినట్టయింది. చటుక్కున చేయి చాచి, వెంటనే వెనక్కు తీసుకుని మరో లైటు వేసి కుర్చీ చూపిస్తూ 'చెప్పండి' అన్నాడు.

పండగ పూట భార్యా బిడ్డలతో గడుపుతుంటే తను వచ్చి పొరపాటు చేశానా అన్న సంకోచం ఒకవైపు అదే క్షణంలో తనకు లేనిదేమిటో తన గుండెల్లో గూడు కట్టుకున్న దిగులుకు కారణం ఏమిటో అర్థం అయిన మూగ బాధ మరోవైపు పెదవి విప్పనీయలేదు.

"చెప్పండి ఏమిటి విషయం?" రెట్టించాడు పీయూష్.

క్షణంపాటు మౌనంగానే వుండి అడిగింది.

"ఎందుకు ఇలా నా వెంటపడి వేధిస్తున్నారు?"

బుల్లెట్‌లా వచ్చి తగిలినట్టయిందామె ప్రశ్న.

'ఏంటీ నేను వెంటబడుతున్నానా?"

"నిన్న మూర్మార్కెట్ వైపు రాలేదూ?"

"నేనా? లేదే? ఏం జరిగింది?"

"నిన్న మాత్రమే కాదు, దాదాపుగా యిలానే జరుగుతోంది. అడిగితే సరైనా సమాధానం వుండదు ఎందుకిలా?"

"అసలేం జరిగిందండీ? పండగ పూట వేళగాని వేళలో వచ్చి గొడవ పెట్టుకుంటున్నారు" కాస్త స్వరం పెంచి అన్నాడు పీయూష్.

"ఇదేనా మీ కారు నెంబరు?

"అవును. అయితే?"

"నిన్న నేను నా ఫ్రెండ్స్‌తో మూర్ మార్కెట్ దగ్గర రోడ్డు దాటబోతుంటే అంతవరకూ పార్క్ చేసి పెట్టిన కారు రయ్యిమని అడ్డం వచ్చేసింది. వెనక్కి వెళ్తే వెనక్కి ముందుకెళ్తే ముందుకి. ఎటూ కదలనివ్వరు. ఏమిటి ఆట?"

"హో! అదా నేను ఢిల్లీ నుంచి ఇప్పుడే ఒక గంట క్రితమే తిరిగి వచ్చాను. వస్తూ వస్తూ సర్వీస్‌కి ఇచ్చిన కారు తెచ్చుకున్నాను" అర్థం అయిందా అన్నట్టు ఆగాడు.

"అదేగా నేనడిగేను. నిలదీస్తే సమాధానం వుండదు." వ్యంగ్యంగా అంది.

"ఎవరు డ్రైవ్ చేస్తున్నారో చూడలేదా?" పట్టించుకోనట్టు అడిగాడు.

'ఎక్కడా? రయ్ రయ్ మని ముందుకీ వెనక్కీ రావటం. తప్పించుకునేందుకే సరిపోయింది. ఆ పైన విండో గ్లాసెస్ మూసేసి వున్నాయి."

"ఆశ్చర్యంగా వుంది. నేనసలు వారం రోజులుగా వూర్లోనే లేను.."

"కాని ఇలా జరగటం యిది మొదటిసారి కాదే?"

సేరియస్‌గా చూశాడు పీయూష్.

"పుస్తకం కొనుక్కోవాలని వెళ్తే అక్కడో మూక తయారు 'నీ యింటి పేరు మారుస్తా సువర్ణా' అని వెధవ కామెంట్స్‌తో. బస్సు కోసం వెయిట్ చేస్తుంటే ముందు నుంచి కారులో చెక్కర్లు. లేదంటే స్కూటర్లలో వచ్చి చుట్టూ రౌండ్లు. ఇదే సినిమా సీనా? ఎందుకు నన్నల్లరిపాలు చేయటం?"

లేచి నిలబడ్డాడు పీయూష్.

"హలో ఏమిటి మీ వుద్దేశ్యం? నాకేం వస్తుంది మీ వెంటబడితే?" నిలదీస్తూ అన్నాడు.

"అది మీ మూకకి తెలియాలి."

"మూకెవరు? నాకేం తెలియదంటుంటే వినరేం?"

"ఇక నటించకండి. ఓపిక నశించి

పోయింది. ఏదో మర్యాదకని కనిపిస్తే ఏదో పలకరింపుగా రెండు మాటలు మాట్లాడాను గానీ మీ సుబ్బుకి చంద్రుకి చెప్పండి. నా జోలికి రావద్దని. నేనసలే మంచిదాన్ని కాదు. అక్కడికక్కడ నిలబెట్టి కొడతాను ఈ సారి."

కత్తి వేటుకు నెత్తురు చుక్క లేనట్టు పాలిపోయిన పీయూష్ వాలకం గమనించినా అదేం పట్టించుకోనట్టు గబగబా లేచి వచ్చేసింది హారితి.

❊ ❊ ❊

లంచ్ టైం. అందరూ వెంట తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు బల్లమీద తెరిచి పెట్టి తలా కాస్త పళ్ళాల్లోకి వడ్డించుకుంటున్నారు. అలా అందరూ కలిసి సహభోజనం చేయటం అక్కడి ఆచారం.

"రావోయ్! అంత కసిగా వుంటే తిని మరింత బలంగా కొట్టొచ్చు." టైపు చేస్తున్న జాన్సీని బలవంతంగా లేవదోసింది రాణి.

"ఏమిటీ? పొద్దున్నుంచి చూస్తున్నాను అంత విసుగ్గా వున్నారు?" బిర్యానీ ఆమె ప్లేటు లోకి వడ్డిస్తూ అడిగింది సుధీర.

"ఏముంది లెండి. ఏ ఇంట్లోనైనా వుండేదే!" నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అంది జాన్సీ.

"నిజమే. అయినా విసుక్కుంటాం. అదీ మామూలే. ఈ రోజేం జరిగిందీ అని" అడిగింది హారితి.

"లేదండీ. మా బాబుకి పళ్ళొస్తున్నట్టు న్నాయి. వళ్ళెచ్చబెట్టి తెగ మారాం చేస్తున్నాడు. దానికి తోడు మా ఆడపడుచు వచ్చింది. మార్నింగ్ సిక్‌నెస్‌వల్ల లేచి ఒకటే హైరాన పెట్టేస్తోంది. మా అత్తగారు నేను చూస్తాన్లే అని బెండకాయ వేపుడు కాస్తా మాడబెట్టేసింది. టాయ్‌లెట్‌కి వెళ్తే హడావుడిలో పక్కనున్న పేపరు చింపాను. అది ఈ రోజుదేనట. అంతే మా ఆయన లేచి దండకం మొదలుపెట్టారు. "న్యూస్‌పేపరు విలువ తెలిస్తే కదా! ఉదయం పూట ఒక నిముషం పాటు ప్రశాంతంగా కూచుని చదువుకోటం కూడా కుదర్దు ఈ కొంపలో " అని మండిపోతూ గబగబా అన్నం కలుపుకుని కోపంగా నోట్లో కుక్కుకుంటూ అంది జాన్సీ.

"ఈడ్చి ఒక్కటిచ్చుకోవల్సింది" పరధ్యానంగా వింటున్న హారితి నోటమ్మట వచ్చేసిందా మాట. పిన్ను పడితే వినిపించేంత నిశ్శబ్దం. వెంటనే హాలు దద్దరిల్లిపోయే నవ్వులు. అనాలోచితంగా అనేసిన హారితి యథాలాపంగా తలెత్తి చూసింది. విచిత్రమైన నవ్వు జాన్సీ మొహంలో. ఏదో అలవాటు లేని మాట విన్నట్టు.

"మీరైతే అంతే చేస్తారా?" అదే నవ్వుతో అడిగింది.

❊ ❊ ❊

"పిల్లలు ఆకలంటున్నారు. వడ్డించేశాను" గోడకో బల్లకో చెబుతున్నట్టు అంది హరీష్ గదిలోకి వచ్చి.

"నా కోసం చూడొద్దు. మీరు కానిచ్చేయండి అంటే వినవు కదా?" పుస్తకం మూసి పెట్టి కుర్చీ వెనక్కి వాలుతూ అంటున్న హరీష్ ఏదో అనబోయి తమాయించుకుని వెళ్ళిపోతున్న భార్యను గమనించి వెంటే లేచి వెళ్ళాడు తనలో తాను నవ్వుకుంటూ.

నెయ్యి వడ్డించి "కలుపుకోండి" అంది.

"నిన్న ఇక్కడ వడ్డించావు" అదే నవ్వు మొహంలో కినుక వహిస్తున్నట్టు అన్నాడు.

"ఏం వడ్డించింది డాడీ?" ముద్దు పలుకులతో అడిగింది కూతురు ప్రీతి.

"నిన్న నానమ్మ పూజ చేయించానని ప్రసాదం పెడితే తిని వచ్చానమ్మా. నేనిక్కడ మీ కోసం పడిగాపులు కాస్తుంటే నా సంగతి పట్టించుకోనక్కర్లేదా అని ఇదో ఇక్కడ ఒక్కటిచ్చింది మీ మమ్మీ" చెంప చూపెట్టి అన్నాడు.

"భలే భలే" అదేదో జోక్ అయినట్లు చప్పట్లు చరిచి నవ్వింది ప్రీతి.

"సర్లెండి. నా స్థానంలో వుండి ఆలోచిస్తే అర్థం అవుతుంది ఏ ఇల్లాలైనా ఏం చేస్తుందని" చిరుకోపం నటిస్తూ అంది.


❊ ❊ ❊

ఒకేసారి ఒకే అనుభవం ఇందరికి అనుభవంలోకి రావటం సాధ్యం ఎలా అవుతోంది? కోయిన్సిడెన్స్. ఒక్క మాటలో తేల్చి చెప్పటం సాధ్యమా? లైఫ్ డ్రామాలోని మెలోడ్రామా అంటేనో? విభావానుభావాలతో కాస్త తేడా వున్నా స్థాయి భావం ఒకటే. వ్యక్తులు వేరు వేరు. సందర్భాలు వేరు వేరు. సమస్య దాదాపు ఒకటే. సంచారీ భావాల వల్ల అనుభవ సారూప్యతతో జనించే ఆర్ద్రత ఒకటే. రసార్ద్రహృదయం వున్న వ్యక్తే వ్యక్తిగత సత్యాన్ని ఒక నిర్వికార దృష్టితో సృజనాత్మకతకు శ్రీకారం చుడతాడు. అతడే కళాకారుడు. కానీ.. కానీ భగవంతుడిని మించిన కళాకారుడెవరున్నాడు? దారంలో మణులు పేర్చినట్టు చరాచర జగత్తును తనలో ఇముడ్చుకుని పదహారు వేల మంది గోపికలతో రాసక్రీడలాడుతూ ఎవరికి వారు కృష్ణుడు నావాడు నాతోనే వున్నాడు అనిపింపచేయగలిగినవాడు.

కానీ అది ద్వాపరం వరకేనా పరిమితం? ఏమో! అంతా ఆ భగవంతుడి లీలా వినోదమే కదా! ←

## వినువీధి

### పగటిచుక్కలు



తారలు విశ్వాంతరాళంలో శాశ్వతంకాదు. వాటికీ జన్మ, జీవితం, మరణం ఉంటాయి. మన సూర్యుడు ఒక తారే. జీవితకాలం 3,500 కోట్ల సం॥లు.

తారలు అంత్య దశల్లో తమలోని శక్తిని క్రమంగా కోల్పోతాయి. కానీ దీనికి 2,000, 2,500 కోట్ల సంవత్సరాల కాలం పట్టవచ్చు. (ఇంకా 1,500, 1,000 కోట్ల సంవత్సరాల కాలం మిగిలి ఉంటుంది) మానవ ఆయుష్షుతో పోలిస్తే 60 సంవత్సరాల వయసు. ఈ వయసులో తారలు క్రమంగా విపరీతంగా పెరిగిపోతాయి. వీటిని అరుణ రాక్షసి తారలు అంటారు. ప్రస్తుతం ఆర్ద్ర, స్వాతి, జ్యేష్ఠ రోహిణి ఇటువంటివే.

తార మరణానికి రెండు మార్గాలు. ఒకటి పెద్ద అట్టహాసంతో జరుగుతుంది. రూపం ఏమవుతుందో. అంతా చెల్లాచెదరు. శ్వేత మరుగుజ్జులుగా అయిపోతాయి.

నోవా అంటే నవ్యతార. ఇవి అకస్మాత్‌గా కాంతివంతమయ్యే నక్షత్రాలు. తారలోని హైడ్రోజెన్ నిలువ అయిపోయి ఉంటుంది. అకస్మాత్‌గా విస్ఫోటనానికి గురి అవుతాయి. ఈ సందర్భంగా కాంతి 5 లక్షల రెట్లు పెరిగిపోతుంది. 20 వ శతాబ్దంలో సుమారు 6 నవతారలు గమనించారు. ఈ కాంతి ఎంతోకాలం ఉండదు.

ఇంకా సూపర్ నోవా తారలుంటాయి. ఇవి పేలినప్పుడు కాంతి ఏకంగా 10 కోట్లు రెట్లు అధికం అవుతుంది. ఇవి చాలా అరుదు. ఇప్పటికి 4 గమనించిన ఆధారాలు ఉన్నాయి. 1054 లో చైనాలో గమనించారు. తరువాత 1572 లో, 1604 లో, 1987 లో కూడా గమనించారు.

అయితే ఈ కాంతి కొద్దికాలం, రోజులు మాత్రం ఉండి మాయమవుతుంది.

మనవారు పగటిచుక్కలు అంటారు. బహుశా ఇవేనేమో. **- జమ్మి కోనేటిరావు**